ఇందిరమ్మ ఇల్లు.. ఉపాధి బిల్లు

- జాబ్‌కార్డు లబ్ధిదారులకు 90 రోజుల హాజరు
- 'ఉపాధి హామీ'కి అనుసంధానంతో ఆర్థిక లబ్ధి
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు, ఉపాధి కూలీలు



పాన్‌గల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

పాన్‌గల్: పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.5 లక్షలు వారి ఖాతాల్లో జమ చేస్తోంది. పేదలకు మరింత ఆసరాగా నిలిచేలా మండల వ్యాప్తంగా మంజూరైన ఇళ్ల లబ్ధిదారులకు జాబ్‌కార్డు ఉంటే ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయనున్నారు. ప్రభుత్వం అందించే రూ. 5 లక్షలతో పాటు ఉపాధి హామీ ద్వారా మరింత ఆర్థిక లబ్ధి కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

హాజరు లెక్కింపు ఇలా..

ఇళ్ల నిర్మాణంలో సమస్యలు, కూలీల కొరత, ఆర్థిక ఇబ్బందులు తదితర వాటిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉండి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల హాజరు వేసేలా చర్యలు తీసుకుంటోంది. బేస్‌మెంట్ నిర్మాణం వరకు 40 రోజులు, స్లాబ్ పూర్తయ్యే వరకు 50 రోజుల పనిదినాలు కల్పిస్తూ 90 రోజుల హాజరు వేయనున్నారు. ప్రస్తుతం ఉపాధి కూలీకి రోజు వారి వేతనం రూ.307 అందిస్తున్నారు. ఈ లెక్కన 90 రోజులకు రూ.27,630 లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్నారు. ఒక్కో కుంటుంబానికి ఏటా వంద రోజుల పనిదినాలు కేటాయిస్తారు. ఈ లెక్కన ఇప్పటికే సదరు లబ్ధిదారులు పదికంటే ఎక్కువ రోజులు ఉపాధి పనులకు హాజరైనట్లయితే 90 రోజులకు ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు హాజరు, పేమెంట్‌తో పాటు మిగిలిన రోజులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామీణాభివృద్ధిశాఖకు వివరాలు..

మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయానికి అందించారు. అక్కడి నుంచి కలెక్టర్ అనుమతితో రాష్ట్ర కార్యాలయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా మూడుసార్లు జియో ట్యాగింగ్ ద్వారా ఫొటోలు తీసి సంబంధిత యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఉపాధి పథకం ద్వారా పొందిన డబ్బుల వివరాల ను ఇంటి గోడపై నమోదు చేయాల్సి ఉంటుంది.

మండలాల వారీగా ఇందిరమ్మఇళ్ల మంజూరు, ఉపాధి కూలీల వివరాలు

మండలం	మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు	నిర్మాణంలో ఉన్న ఇళ్లు	ఉపాధి కూలీల సంఖ్య
పాన్‌గల్	498	248	6476
చిన్నంబావి	325	192	5590
వీపనగండ్ల	375	100	4337

ఆదేశాలొచ్చాయి..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉపాధి కూలీల అనుసంధానం విషయంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నిర్ణయంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, ఉపాధి కూలీలకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం నిబంధనల మేరకు ఆదేశాలను అమలు చేస్తాం.

– ఉమాదేవి, డీఆర్‌డీఓ, వనపర్తి

కొంత ఊరట..



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఉపాధి హామీ పథకానికి అనుసంధానంతో ఆసరాగా నిలుస్తోంది. ఉపాధి కూలీలు 90 రోజుల పాటు పనులు చేసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మాలాంటి పేద వారికి కొంత ఆర్థిక తోడ్పాటు కలుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మేలు కలుగనుంది.

– సుమతి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలు, మాధరావుపల్లి

ఉపాధి కూలీలకు మేలు కలుగుతుంది



ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు 90 రోజుల పాటు ఉపాధి కూలీలను అనుసంధానం చేస్తూ పనులు చేసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద లబ్ధిదారులు, ఉపాధి కూలీలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఈ నిర్ణయంతో కూలీలకు పనులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక వేసులుబాటు కలుగనుంది.

– సూర్యవంశ రాము, సీఐటీయూ నాయకుడు, బుసిరెడ్డిపల్లి

క్లుప్తంగా

వైభవంగా ఆదిదంపతుల కల్యాణం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో శ్రీదత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆదిదంపతులు శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో సంకల్ప పూజలతో మాంగళ్య పూజలు చేయగా భక్తులు తలంబ్రాలు పోసి అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. ఆలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాలు, శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

పాన్‌గల్ ఎంఈఓగా ఆనంద్



పాన్‌గల్: మండల నూతన ఎంఈఓగా మాందాపూర్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం ఆనంద్ మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండలంలో ఎంఈఓగా పనిచేసిన శ్రీనివాసులు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌ను ఎమ్మార్సీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, ఎమ్మార్సీ సిబ్బంది గోవిందనాయక్, పీఆర్‌టీయూ సంఘం జిల్లా నాయకులు బొద్దారెడ్డి, యూటీఎఫ్ సంఘం నాయకులు శ్రీరామ్, మురళీ, రాధాకృష్ణ , శేఖర్‌నాయక్, మూర్తి, రమాదేవి,భార్గవి, వంశీ పాల్గొన్నారు.

పేదల తిరుపతి తిరుమలయ్య గట్టు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగుడెం శివారులోని తిరుమలయ్య గుట్టపై కొలువైఉన్న శ్రీవేంకటేశ్వరస్వామికి ఆలయ పూజారి అభిషేకం, అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చురాము, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్‌గౌడ్, శ్రీనివాసులు, గోనూరు వెంకటయ్య, కేకే మూర్తి, అశోక్, బెల్లం రాజు, పట్టణ ఆర్యవైశ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

అమరచింతలో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు




అమరచింత: 'నమస్తే సదావత్సలే మాతృభూమి' అంటూ ప్రతిజ్ఞతో పట్టణంలోని పలు వీధుల్లో ఆర్‌ఎస్‌ఎస్ సంఘ సభ్యులు మంగళవారం కవాతు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకల్లో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ ధర్మ జాగరణ విభాగ్ ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ రిటైర్డ్ టీచర్ లింగన్న, ఎల్ల బాలస్వామి, బావండ్ల రాములు పాల్గొన్నారు.

38 లీటర్ల మద్యం పట్టివేత

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో మంగళవారం కిరాణం షాపులో 38 లీటర్ల మద్యం పట్టుకున్నామని పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీ చెందిన పల్లెమోని బాలరాజు కిరాణం షాపులో తనిఖీ చేయగా, 38 లీటర్ల మద్యం లభించింది. ఈ మద్యం విలువ రూ. 29,900 ఉంటుందని, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని పల్లెమోని బాలరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా మద్యం అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణానికి చెందిన రాజకౌశిక్ జేపీఎన్‌సీలో బీటెక్‌లో చేరాడు. అతని టాలెంట్ గమనించి స్థానికులు అభినందించారు. కల్వరాల ప్రభాకర్‌కు విద్యార్థికి రూ. 82 విలులైన ల్యాప్‌టాప్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజకౌశిక్ కుటుంబ సభ్యులు ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



పాన్‌గల్ మండలం బండపల్లిలో వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆత్మకూర్ మండలంలోని మూలమల్లలో వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వనపర్తిలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, ప్రజా, కుల సంఘాల నాయకులు



సోళీపురంలో వాల్మీకి జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు



శ్రీ రంగాపురంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కొత్తకోట చౌరస్తాలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ అధ్యక్షతన వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో, మహానీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, స్థానిక నాయకులతో కలిసి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు బండపల్లి, రాయినిపల్లి, కేతేపల్లి బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు రాంమూర్తి నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, నీలస్వామినాయుడు, కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోట: కొత్తకోట చౌరస్తాలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పసుపుల నెహ్రూ, ఎల్లయ్య, బందెన్న, కుర్మయ్య, మహేష్, రాజు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండులో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో మండ్ల ఆంజనేయులు, మిల్క్ వెంకటేష్, టైలర్ వెంకటేష్, అరవింద్, శివ పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. హర్ష వెంకటేష్, మేస్త్రి సురేష్, కడియాల నరసింహులు, ఆంజనేయులు ఉన్నారు.

మదనాపురం: మండలంలో వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అజ్జకొల్లు, మదనాపురం, తిర్మాలయపల్లి, దుప్పల్లి, కొన్నూరు గ్రామాల్లో నిర్వహించారు.

ఆత్మకూర్: ఆత్మకూర్ మండలంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం, సోళీపురంలో వాల్మీకి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. సోళీపురంలో వాల్మీకి విగ్రహం, గుడిని పూలతో అలంకరించారు. మహిళలు బొడ్డెమ్మ ఆడారు.

సమస్యలపై నేతలను నిలదీయాలి

వీపనగండ్ల: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించి స్థానిక ఎన్నికల్లో రాజకీయ పార్టీ నేతలను నిలదీయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం బొల్లారంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కురుమయ్య, చెల్మారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



అమరచింత: రోజురోజుకు సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సీఐ శివకుమార్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో వచ్చిన ప్రతి మెసేజ్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని, ట్రాలీ ఆటోలలో పరిమితికి మించి కూలీలను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ స్వాతితో పాటు పలువురు పాల్గొన్నారు.

మైనర్‌పై కేసు నమోదు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన బాలుడు ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కేరాణి తెలిపారు. సంగినేనిపల్లి గ్రామానికి చెందిన 15 ఏళ్ల నరసింహ హైదరాబాద్ వెళ్లి కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు గోవుల శీదేవి, శాంతయ్యలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైల్లో నుంచి పడి వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న శివకుమార్

ఆత్మకూర్: రైల్లో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. గద్వాల మండలం షాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైల్లో షాద్‌నగర్ నుంచి గద్వాలకు వెళ్తున్నాడు. ఆత్మకూర్ మండలంలోని దేవరపల్లి గ్రామ సమీపంలో రైలు డోర్ వద్ద నుంచి శివకుమార్ జారి పడిపోయాడు. అక్కడే ఉన్న రైతులు గమనించి తీవ్ర గాయాలైన శివకుమార్‌ను 108లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వనపర్తి ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

వనపర్తి రూరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేయడంతో ఏఐవైఎఫ్, సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో కుతుబ్, శ్రీనివాసులు, మహమ్మద్, ఎండీ నదీఫ్, వంశీ, లక్ష్మీనారాయణ, బాలిమియా పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



అమరచింతలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



వీపనగండ్లలో..



ఖిల్లాఘనపురంలో..

అమరచింత: పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు, ఎన్నికల నిర్వహణపై మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఓ, ఏపీఓలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్ యాదవ్, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.

మదనాపురం: మదనాపురం మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్, తహసీల్దార్ జెకే మోహన్, ఎంపీడీఓ ప్రసన్న కుమారి, ఎంఈఓ ఫారుక్ హుస్సేన్, ఎంపీఓ హుస్సేనప్ప పాల్గొన్నారు.

వీపనగండ్ల: స్థానిక ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికలో విధులపై ఆర్పీలు జయంత్‌రెడ్డి, జితేందర్‌గౌడ్‌లు అవగాహన కల్పించారు.

ఖిల్లాఘనపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సుల నిర్వహణలో పీఓలు, ఏపీఓలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సునిత, ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో స్థానిక ఎన్నికల నిర్వహణపై పీఓ, ఏపీఓలకు శిక్షణ నిర్వహించారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం తథ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

చిన్నంబావి: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం తథ్యమని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని పెద్దమారులో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి ఏడాదిన్నర గడిచినా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, జూపల్లి కృష్ణారావు చేసిన అభివృద్ధిపై చర్చకు ఎక్కడికైనా సిద్ధం అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, గోవిందు, శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఈదన్న యాదవ్, చిన్నారెడ్డి, తిరుపాల్ నాయుడు, సింగిల్‌విండో డైరెక్టర్ డేగ శేఖర్, ఆనంద్ యాదవ్, నారాయణ, ఈశ్వరయ్య, ఈశ్వ రెడ్డి, శివారెడ్డి, తగరం కురుమయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపుదారులపై చర్యలు తీసుకోవాలి

వీపనగండ్ల: అక్రమంగా ఇసుకను తరలిస్తూ, రైతులపై దాడులకు పాల్పడుతున్న ఇసుక అక్రమ తరలింపుదారులపై చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి తూముకుంటలో ఇసుకను తరలిస్తున్న వారు చేసిన దాడిలో గాయపడ్డ రామకృష్ణారెడ్డిని ఆయన పరామర్శించారు. తూముకుంట ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా తీసుకోకుండా యథేచ్ఛగా తరలిస్తుండటంతో పరిసర ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కమలేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన వైష్ణవికి సన్మానం



వైష్ణవిని సన్మానిస్తున్న మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్

మదనాపురం: మదనపూర్ మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన కరిక పద్మ, నాగేష్ ల కుమార్తె వైష్ణవి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన లాక్రాజ్ చాంపియన్ షిప్ సీనియర్ సౌత్ జోన్ 2025లో గోల్డ్ మెడల్ సాధించింది. మంగళవారం మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ గ్రామ నాయకులతో కలిసి, శాలువాతో ఆమెను సన్మానించి, అభినదించారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, రాములు, సీనియర్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, కరగట్ల మల్లేష్, ఎద్దుల లక్ష్మన్న, బోయిని శ్రీనివాసులు, వడ్డే శ్రీను, శరణ్ జయేందర్, ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జులు

ఖిల్లాఘనపురం: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచుల ఎన్నికల్లో సత్తాచాటాలని ఎన్నికల ఇన్‌చార్జులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, ఎ.సీతారాములు అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఆశావాహుల నుంచి జాబితాను సేకరించారు. కార్యక్రమంలో విక్రం, జిల్లా ఎస్టీమోర్చా అధ్యక్షులు రవినాయక్, సత్యానారాయణ, నవీన్‌రెడ్డి, సాయినాథ్, చెన్నయ్య సాగర్, ఆశన్న, గోపాల్‌రెడ్డి, రాజు, గోపి ముదిరాజ్, రాములు, ఈదమ్మ, చక్రవర్తి, మాదవ్ పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

గట్టు: బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల గ్రామీణ వికాస బ్యాంక్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని యల్లందొడ్డి గ్రామంలో మంగళవారం బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ– గవర్నెన్స్, డిజిటల్ లావాదేవీలపై వివరించారు. ఆర్థిక భద్రత కోసం ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పెన్షన్, బీమా పథకాలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, పీవై, ఎస్ఎస్‌వై వంటి పథకాల ప్రాముఖ్యత తెలియజేశారు. డిజిటల్ యుగంలో ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసపూరిత ప్రకటనలు నమ్మి, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత వివరాలు తెలియజేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930కు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనూష, ప్రకాష్, వీరేష్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజియన్‌లో ఉత్తమ ప్రతిభ

వనపర్తిటౌన్: వనపర్తి ఆర్టీసీ రీజియన్ పరిధిలో దసరా వేళా అత్యధిక ఆదాయం సమకూరిందని వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో దసరా సందర్భంగా స్పెషల్ బస్సులను నడపడం ద్వారా అధిక ఆదాయం ఆర్టీసీ సమకూర్చిందని, ఇది రీజియన్‌లో వనపర్తికే గర్వకారణమన్నారు. వనపర్తి ఆర్టీసీని ఆదాయంలో ముందుంచేందుకు డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు కలిసికట్టుగా పని చేయడం ద్వారానే వనపర్తికి తగిన గుర్తింపు లభించిందని చెప్పారు. దసరా సందర్భంగా మొత్తం 10రోజుల్లో 4.77 లక్షల కిలోమీటర్లు ప్రయాణం చేయడంతో 110శాతం ఓర్, ఈపీకే ద్వారా 66.34తో మొత్తం రూ.3.16కోట్ల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు.

రోడ్లు జలమయం

కోడేరు: మండల కేంద్రంలో మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. భారీ వర్షం కురువడంతో పలు కాలనీలలో వర్షం నీరు నిలిచింది. గతంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులకు విన్నవించినా లాభం లేకుండా పోయిందని పలు కాలనీవాసులు వాపోయారు. ప్రతియేటా వర్షకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

